నిర్ణయం

ఊరంకి వెంకటరావు



అనంతరామయ్య సాయంత్రం ఐదు గంటలు దాటాక కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసులోనుంచి బయట ప్రపంచంలో పడ్డాడు. మామూలుగానే నిస్సారంగా అతనికి అగుపించే జీవితం ఆరోజున మరీ నిస్సారవిహీనంగా కనిపించసాగింది. అతని జీవితం వెనకకు తిరిగి తరచి చూసుకొన్నపుడల్లా అతనికి అలాగే వుంటుంది. అతనికి యాభై సంవత్సరాలు నిండాయి. శరీరంలో చెప్పుకోదగ్గ రుగ్మతలేమీ లేకపోయినా, అతను జీవిత పరుగు పందెంలో అలసటచెంది, విశ్రాంతి కోరుకొనే స్థితికి వచ్చాడు. శరీరం దారుఢ్యంగా వున్నా, పరిస్థితుల ప్రభావంవల్ల, తీరని కోరికలవల్ల, నెరవేరని ఆశలవల్ల, అసంతృప్తివల్ల బాగా

చితికి, చివికిపోయిన మనస్సు అతని దేహదారుఢ్యాన్ని కూడా కృంగదీసిందనే చెప్పాలి. దగ్గర దగ్గర ముప్పైఏళ్ళుగా అనగా అతను లోవర్ డివిజన్ క్లర్కుగా ప్రవేశించిన దగ్గరనుండీ నెట్టుకుంటూ వస్తున్న యీ గానుగెద్దు జీవితంమీద అతని మనస్సు బాగా తిరుగుబాటు చేస్తోంది.

మనసుకి ఎన్నో కోరికలుంటాయి. అది రెక్కలు కట్టుకొని ఎగిరిపోగలదు. యదార్థంగా తీర్చుకోలేని, సాగించుకో లేని ఎన్నో ఆశలను పెంచుకొని, ఎంతో ఎత్తుకు పెరిగిపోగలదు మనసు అయితే ఆ కోరికలను, ఆ ఆశలను పగటికలలు కంటూ ఊహాలోకంలోనే తీర్చుకోవాలి గాని, అనంతరామయ్యవంటి సామాన్యుడికి, అవి వాస్తవంకావడం అసంభవం. అందుకని తను దాదాపు ముప్పై సంవత్సరాలుగా దొర్లించుకుంటూ వస్తున్నజీవితంమీద విరక్తి తనమీద తనవారిమీద, తన పరిస్థితులమీ దకోపం పగ, కసి. తన జీవితవిధానాన్ని తాను ఊహించుకున్న ఉన్నతస్థానంలోకి తీసుకెళ్ళలేని తన అశక్తతమీద కోపం. తీయని, సుఖకరమైన, ఐశ్వర్యప్రద మైన, ఉన్నతోన్నతమైన జీవితాన్ని ఊహించుకోవడం, దానికోసం అర్రులు చావడం, ఆశపడడం, ఆ జీవితం తనకు లభ్యంకాలేదని విరక్తితో, ప్రస్తుతం నడుస్తున్న, గడుస్తున్న జీవితంతో రాజీ పడలేకపోవడం. ఇది ఎవరికైనా నిర్లిప్తతను, నిరాశను, విరక్తిని కలుగజెయ్యక మానదు.

ఒక వైపు తన జీవితం తాను ఊహించుకొన్న ప్రగతి మార్గంలో ఒక్క అంగుళమైనా కదలకపోగా, తన చుట్టూవున్న వాళ్ళలో కొందరు, వాళ్లెందుకూ పనికిరానివాళ్ళని తన అంచనాలో కచ్చితంగా నిర్ధారింపబడిన వాళ్ళు తన కళ్ళముందే, చూస్తూ వుండ గానే చిన్నవాళ్ళు పెద్దవాళ్ళయిపోవడం సంఘంలో ప్రయోజకులుగా చెలామణీ అవడం, తన అప్రయోజకత్వాన్ని రెట్టించినట్లుగా, అవహేళనచేసినట్లుగా కనపడసాగింది అనంతరామయ్యకు. కాఫీహోటలు సర్వరుగా పనికి చేరిన వాడు కొంతకాలానికి పెద్ద ప్రొప్రయిట రయిపోయి, పెద్ద హోటలు, లాడ్జింగు నడుపుతున్నాడు. బస్సులో కండక్టరుగా చేరినవాడు ఒక బస్సు, రెండు లారీలకు యజమాని అయిపోయాడు. పదేళ్ళలో; ఒక డాక్టరుగారి ఆస్పత్రిలో పుళ్ళు, దెబ్బలు కడిగి డ్రెస్సింగుచేసే వార్డు బాయ్ పదిహేను సంవత్సరాలలో ఒక టాక్సీ, ఒక లారీ సంపాదించి, రెండు కిళ్ళీకొట్లు నడిపిస్తున్నాడు. కిరాణాకొట్లో తూకాలు తూచేవాడు ఓ పెద్ద కొట్టుకు యజమాని అయాడు. రెండులక్షం రూపాయలు వడ్డీకి తిప్పుతున్నాడు. తాను మాత్రం రైల్వేలో చిన్న గుమాస్తాగా

ప్రవేశించినవాడు యీ ముప్పైఏళ్ళకూ ఒక పెద్ద గుమాస్తాగా అయాడు. ప్రథమ భార్య పదేళ్ళక్రితం చనిపోతే ఆమె చెల్లెల్నే మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు— తాను చేసుకోలేదు. వాళ్ళు ఆమెను తన మెడకు గుదిబండలా వేశారు. అలా చెయ్యడానికీ, అతను చేసుకోవడానికీ ఎన్నో కారణాలు చూపించారు తన అత్త మామలు. వారి దృష్టిలో అవన్నీ సవ్యమైనవే. అప్పట్లో, తనకూ, తన ప్రథమభార్య సంతానానికీ, వండిపెట్టడానికీ, ఇల్లు చక్కదిద్దుకోడానికీ ఒక ఆడదిక్కు కావాలిగదా అని, తనూ తన మరదల్ని పెళ్ళిచేసుకోవడానికి తయారుపడ్డాడు. ఆ పిల్లని తనకు కట్టబెట్టి వాళ్ళ బాధ్యత తీర్చుకున్నారు. తనకీ, ఆమెకూ యిరవై సంవత్సరాలు తేడా. సంసారరథానికి కట్టిన రెండు ఎద్దుల్లో ఒక ఎద్దు వయస్సు మరో ఎద్దు వయస్సుకి రెట్టింపు. ఒకరి భావాలు, ఆశలు కోరికలు, సరదాలు వేరొకరి వాటితో సరిపోవు. తన భార్య రామలక్ష్మి మంచి వయస్సులో వున్నది గనుక ఆమె కోరికలు సహజంగానే ఉరకలు వేస్తూ వుంటాయి. తన రక్తంలో ఉడుకు తగ్గిపోయింది. తన ఆలోచనలు, భావాలు బాధ్యతతో కూడుకొన్నవి. బాధ్యత విస్మరించి తనూ, తన పడుచుపెళ్ళాం రాజా రాణీల్లాగ జీవితాన్ని నెట్టివేసి, అప్పులపాలై, పిల్లల్ని పస్తులు పడుకోబెట్టలేరు. తన మీద ఆధారపడినవాళ్ళకి తిండికీ, గుడ్డకూ, చదువుకూ లోటులేకుండా చెయ్యాలనే బాధ్యత తన గానుగెద్దు జీవితానికి కారణం. తన జీతం రబ్బరులాగ సాగదు; తన జీవితం పంచకళ్యాణిలా పరుగులెట్టదు-ఇలాటి భావాలెన్నో అతన్ని ముసురుకొన్నాయి. ఆఫీసులో పని ఎక్కువగా లేదుగాబట్టి యీ ఆలోచనలు అతన్ని మరీ ముంచెత్తాయి. ఆ ఆలోచనలతో కూడిన నిరాశ మరీ కృంగదీసింది.

అనంతరామయ్య టీ దుకాణంలోకి వెళ్ళి టీ త్రాగి వచ్చాడు. అతనికి మామూలు అలవాటుప్రకారం యింటికి వెళ్ళాలనిపించలేదు. అతని కాళ్ళు పార్కువైపు తీసుకొని వెళ్ళాయి. పార్కులో ఒకమూల గడ్డిలో చతికిలబడ్డాడు. పార్కులో పిల్లలు నిశ్చింతగా ఆడుకుంటున్నారు. రిటైరయిపోయిన ముసలివారు ప్రశాంత వాతావరణాన్ని అనుభవిస్తున్నారు. యువతీ యువకులు మధుర భావనాలోకంలో తేలిపోతున్నారు తాను మినహా అందరూ ఏ చీకూ, చింతా లేనట్లుగానే అతనికి కనిపించారు.

పార్కులో ఏకాంతం, ప్రశాంతత లభిస్తుంగనే అతను పార్కుకి వచ్చాడు. పార్కులోని పూలమొక్కలుగాని, చల్లని గాలిగాని, అమాయకంగా ఆడుకుంటూ, ఆనందంతో ఉక్కిరి బిక్కి

తయే పిల్లల నవ్వుమొగాలుగాని అతనికి ప్రశాంతతను కలుగజెయ్యలేదు. అయితే అతని అంతరంగంలో లేని ప్రశాంతత పై వాతావరణంనుంచి ఎక్కడ ఏర్పడు తుంది ?

అతని ఊహలన్నీ గజిబిజిగా వుండి చికాకు కలగజేస్తున్నాయి. ఏదో అసంతృప్తి అతన్ని వేధిస్తోంది. సాధిస్తోంది. ప్రతి మనిషికీ సుఖం కావాలి, ఆనందం కావాలి; సంతృప్తి కావాలి. అనంత రామయ్యకు ఆశించినంత సుఖం, ఆనందం, సంతృప్తి జీవితంలో లభ్యం కాలేదు. కోరికల్నీ, ఆశల్నీ, చంపుకుని గడియారం ముల్లులాగ ఒకే పరిధిలో, ఒకే క్రమంలో జీవిస్తున్నాడు. ఆ జీవితం తనకోసం జీవిస్తున్నట్లుగా లేదు. ఎవరికోసమో తను జీవిస్తున్నాడు; ఎవరికోసమో తను చాకిరీ చేస్తున్నాడు. ఎవరికోసమైతే తను చాకిరీచేస్తున్నాడో వారిదగ్గరనుంచి తనకు ప్రేమ, ఆదరం లేవుసరికదా కనీసం సానుభూతి, జాలి, ఒక చల్లని మాటయినకూడా లేవు. అనంతరామయ్య మెదడులో ఏదో మెరుపు మెరిసినట్లయింది. అవును, తనపై తన భార్యకుగాని, పిల్లలకుగాని వాత్సల్యం గౌరవం, సానుభూతి ఏమీ లేవు. వారు అవేమీ తనపట్ల కనపరచినా, కనపరచకపోయినాతానువారినిపోషిస్తాడు ఆదుకుంటాడు.తన శక్తినీ,శ్రమనూవారికి ధారపోస్తాడు. ప్రతిఫలంగా తన భార్య తనకు వండిపెడుతుంది. అంతవరకూ బాగానేవుంది. మరి వీలున్నప్పుడల్లా, అవకాశాన్ని జారవిడువకుండా సూటిపోటీ మాటలతో తనను గాయపరుస్తుంది. తనను ఒక చేతగానివాడుగా నిర్ణయించి, ఆ చేతగానితనాన్ని ఎత్తి చూపిస్తుంది; దెప్పిపొడుస్తుంది. ఆమె మెడలో తను తాళికట్టి వుండకపోతే మరెవరో మహారాజు వచ్చి ఆమెను భార్యగా స్వీకరించి, మొయ్యగలిగినన్ని బంగారునగలూ, బట్టలకొట్టునిండా వుండేటన్ని చీరలూ యిచ్చి, ఆమెకు సర్వసౌఖ్యాలూ, వొళ్ళుకందకుండా జరిపించేవాడని ఆమె అభిప్రాయం కావచ్చు. ఆ కోరిక ఆమెకు తీరకుండా తను అడ్డుపడ్డాడు. అందుకని అతని జీవితాన్ని నరకప్రాయం చెయ్యడమే ఆమె ధ్యేయం.

అనంతరామయ్యకు జీవితంలో ప్రేమాస్పదులుగా కనపడినవారు ముగ్గురే ముగ్గురు. వారు తన తల్లి, తన ప్రథమభార్య, తన అన్నగారు తల్లి పోయి చాలాకాలం అయింది. ప్రథమ భార్యపోయి పదేళ్ళయింది. అన్నగారు రిటైరయిపోయి దూరంగా వున్నాడు. రెండు నెలలకో ఉత్తరం వ్రాస్తూ వుంటాడు. అతని ఉత్తరమే తనకు కొంత ఊరట. తనకు ఆఫీసులోగూడా ఎవరూ స్నేహితులులేరు. అక్కడ కూడా జీవితం యాంత్రికంగానే సాగి

పోతుంది. ఈ పరిస్థితులలో తనజీవితానికి అర్థమేమిటో, తానెందుకు, ఎవరికోసం బ్రతికివున్నాడో, తను జీవితంలో సాధించినదేమిటో అతనికి బోధపడలేదు. మొత్తానికి తన జీవితం వెనక్కి తిరిగి చూసుకున్నా, పెంచుకున్న మమతలు, ఆశలతో ముందుకిచూసినా, సారహీనంగానే కనపడింది.

వారంరోజులు శలవుపెట్టి ఎక్కడైనా వెళ్ళిపోతే అలసిపోయిన తన గానుగెద్దు జీవితానికి విశ్రాంతి లభిస్తుంది. తన భార్యా పిల్లలకు తన మొగం కొన్నాళ్ళు కనబడకుండావుంటే వారికి కొంత కాలానికి తనని చూడాలని అనిపించవచ్చు. తనపై కొంత ఆప్యాయతకలగవచ్చు; ఆ యింట్లో తన స్థానమేమిటో వాళ్ళు గుర్తించవచ్చు.

ఏ మనిషైనా, వస్తువైనా నిత్యం కళ్ళకు కనబడుతూవుంటే ఆ మనిషికి కాని, ఆ వస్తువుకుగాని విలువ ఏమీ వుండదు. ఆ మనిషినిగాని, వస్తువునుగాని,పోగొట్టుకున్నప్పుడే,మనిషి విలువ, వస్తువు విలువ తెలుస్తాయి. అందుకని కొన్నాళ్ళపాటు ఎటో వెళ్ళిపోదామనుకొన్నాడు అనంతరామయ్య.

ఆ నిర్ణయం అతను చేసుకోగానే మళ్ళీ ఆ ఆలోచన ఎక్కడ మారిపోతుందోననే భయంతో, పార్కులోంచి లేచి గబాలున బయటికి వచ్చాడు. గబగబా నడిచి రైల్వే అసిస్టెంటు యింజనీరుగారి బంగళాకు వెళ్ళాడు. అదృష్టవశాత్తు ఆయన యింటిదగ్గరే ఉన్నాడు. తనకు నీరసంగా వుందనీ, పనిచేయలేక పోతున్నాననీ, వారం రోజులు శలవుయిస్తే అన్నగారి దగ్గరకు వరంగల్ వెడతాననీ అభ్యర్థించాడు. ఆయన శలవు యివ్వకపోవడానికి ఎన్నో కారణాలుచెప్పి, ఎలాగైతేనేం రెండురోజులు తగ్గించి, ఐదురోజులకు శలవు మంజూరు చేశాడు. ఎలాగూ విజయవాడ దాటి వెడుతున్నావుగనుక ఆ దారిన విజయవాడలో దిగి ఆఫీసులో పనిచూసుకొని రమ్మనమని పనిపురమాయించాడు యింజనీరుగారు. ఇంజనీరుగారు విజయవాడలో రైల్వేసూపరింటెండింగ్ యింజనీరు ఆఫీసులో పనిఎలాగూ అప్పజెప్పారుగదా అని, కొంతదూరం ఛార్జీలు కలిసివచ్చినా కలిసిరావడమేనని, అనంతరామయ్య విజయవాడకు రైల్వే పాసు అడిగాడు. ఏ. యి. గారు విసుక్కుంటూ ఒక ప్యాసు వ్రాసి యిచ్చాడు.

అసిస్టెంటు యింజనీరుగారి దగ్గర ఐదురోజులు శలవు, రైల్వేపాసూ సంపాదించేటప్పటికి ఏదో అసాధ్యమైనది సంపాదించానన్న సంతృప్తి, సాధించానన్న ఆనందం అనంతరామయ్యకు కలిగాయి. కాని ఆ ఆనందం కాస్తా యింట్లో అడుగుపెట్టేసరికిహరించిపోయింది.

అనంతరామయ్య రైల్వే అసిస్టెంటు యింజనీరు ఆఫీసులో అప్పర్ డివిజన్ క్లర్కు గనుక క్వార్టర్సు యిచ్చారు. అందులో అతనూ, భార్య రామలక్ష్మి, ప్రథమభార్య సంతానం రామశేషు, కృష్ణసాయి, రెండోభార్య సంతానం మంగ, గంగ వుంటున్నారు. రామశేషు బి కాం. ప్యాసయి, పాతికేళ్లు దగ్గర దగ్గరగా వచ్చినా ఖాళీగానే వుంటు న్నాడు. కృష్ణసాయి యింటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మంగకి తొమ్మిదేళ్లు, గంగకి ఆరేళ్లు. ఆ ఆరు గురికీ ఆ క్వార్టర్సు యిరుకే. అసలు వాళ్ళ జీవితాలే యిరుకుజీవితాలు.

సాయంత్రం ఐదున్నరకి యింటికి రావలసిన భర్త అనే ద్విపాదం రాత్రి ఏడుగంటలకి కొంపకి చేరుకున్నందుకు రామలక్ష్మి కొరకొర చూసింది — 'నీ సంజాయిషీ ఏమిటన్నట్లు.' అనంతరామయ్య ఆచూపు అర్థం తెలుసు కొన్నట్లుగా ముఖం మళ్ళించేశాడు. నెలలో ఆఖరురోజుల్లో నెలవారీ స్టేటు మెంట్లు తయారుచేసే రోజుల్లోనేగాని అనంతరామయ్య యింటికి ఆలస్యంగా రావడానికి వీలులేదు. ఓరోజు అనంత రామయ్య యింటికి ఐదున్నరకి వస్తే యింటిని అతనికి అప్పజెప్పి ఆడపిల్ల లిద్దర్నీ తీసుకుని సినిమాకి వెడదా మనుకొంది రామలక్ష్మి. ఐతే అనంత రామయ్య ఆలస్యంగా రావడంవల్ల ఆమె సినిమా ప్రోగ్రాంకి ఆటంక మేర్పడింది.

"కాఫీ చల్లారిపోయింది. ఫ్లాస్కు కొనమంటే కొన్నారు గాదు. స్టౌ వెలిగించుకుని వెచ్చబెట్టుకు తాగండి. మీరు కొన్న ఆవెధవ బొగ్గులు త్వరగా అంటుకొని తగలడవు. నాకు తల నొప్పిగా వుంది. తలనొప్పి మాత్రలు తెచ్చే దిక్కుయినాలేదు, అబ్బా... అమ్మా..." అంటూ ఆవిడ మంచం మీద వాలిపోయింది.

"దారిలో టీ తాగాను. నాకు కాఫీ అక్కరలేదు. వంటయితే భోజనంచేసి, రాత్రి 9 గంటల రైలుకి విజయవాడ వెడతాను," అన్నాడు అనంతరామయ్య.

"కట్టుకున్నది తలనొప్పితో ఛస్తూంటే విజయవాడ, గుంటూరు ఎందుకండీ. ఎంతసేపూ మీ ఆఫీసూ, మీ ఫైల్సూ, మీ బిల్లులూ, మీ స్టేటు మెంట్లేనా, యింట్లోవాళ్ళకి ఏంకావాలో చూడడముందా?" అన్నది రామలక్ష్మి, అనంతరామయ్య ప్రయాణమై వెళ్ళ డానికి తన నిరసన తెలుపుతూ.

"అమ్మా, నీకు తలనొప్పిగావుంటే సినిమాకి ఎలాగ వెడదామన్నావే?" అంది కూతురు అమాయకంగా.

"ఛా, నోర్ముయ్. అప్పటికి తల నొప్పి నాకెక్కడిది.అంతా అరగంటయి పట్టుకుంది.అమ్మా...అబ్బా..."అంటూ దీర్ఘాలు తీసింది.

అనంతరామయ్య వెంటనే చెప్పులు తొడుక్కొని బజారుకెళ్ళి రెండురకాల తలనొప్పి మాత్రలు కొనితెచ్చి, ఆమె కిచ్చి, 'స్టౌ' వెలిగించి కాఫీ వెచ్చబెట్టి యిచ్చాడు. ఒకమాత్ర వేసుకొని, కాఫీ తాగి కళ్ళుమూసుకుని పడుకొంది. అదొకరకమైన సత్యాగ్రహం. అది అనంతరామయ్యకు కొత్తగాదు.

తనకి రైలుకి టైమయి పోతూవుంటే తనే కంచం పెట్టుకొని, పీటవేసుకొని వడ్డించుకొని భోజనం అయిందని పించాడు. ఆ తర్వాత సంచీలో రెండు పంచలు, రెండు చొక్కాలు, కండువా, తువాళ్ళు కుక్కుకొని ఆదరా బాదరా స్టేషనుకి బయలుదేరాడు. అంతవరకూ తన చర్యలు కనిపెడుతున్న తన భార్య "ఎప్పుడు వస్తారు?" అని అడిగింది. తనకి వళ్ళుమండింది. సమాధానం చెప్పకూడదనుకొన్నాడు గాని, ఆకోపం లోనే "ఈ కొంపకి రావడమంటూ వుంటే, ఐదురోజులు పోయాక" అన్నాడు. "ఏం? మళ్ళీ రాకూడదనే వెడుతున్నారా?" అన్నది. ఆ మాటకు ఏమీ సమాధానం చెప్పకుండా అతను బయటికి వచ్చేశాడు.

దారిలో పెద్దకొడుకు రామశేషు కనపడితే తాను తన అన్నగారింటికి వరంగల్ వెడుతున్నాననీ, నాలుగైదు రోజుల్లో తిరిగి వస్తాననీ, జాగ్రత్తగా వుండమనీ హెచ్చరించాడు. "నాన్నా, పెదనాన్నతో చెప్పి అక్కడేమైనా వుద్యోగంవుంటే నాకు చూడమనిచెప్పు నాన్నా. ఆయన ప్రయత్నిస్తే ఏదో ఒకటి దొరక్కపోదు" అన్నాడు రామశేషు.

"సరేలే, అలాగే" అంటూ వెళ్ళి పోయాడు అనంత రామయ్య స్టేషను వైపు.

రైల్లో కూర్చున్నాక అనంత రామయ్య ఆలోచనలు మళ్ళీ తనజీవితం మీదకి మళ్ళాయి. తన భార్య ప్రవర్తన అతనికి మాటిమాటికీ జ్ఞాపకంవచ్చి బాధకలుగుతోంది — ఆమె ప్రవర్తన తనకు కొత్తకాకపోయినప్పటికీ, ఆమెకి తనమీద కొంచెమైనా — ప్రేమమాట దేవుడెరుగు — భక్తిగాని, భయంగాని, గౌరవంగాని లేవు. తనను ఆమె ఒక బంట్రోతుకన్నా హీనంగా చూస్తోంది— అదీ తన పిల్లలముందే. తన పిల్లలకు తనపట్ల వారి అంతరాంతరాలలో ఏ కాస్త గౌరవంవున్నా, అభిమానంవున్నా ఆమె తన ప్రవర్తనతో అదికూడా లేకుండా చేస్తోంది. అతనికి యింట్లో వుండవలసిన స్థానం ఆమె యివ్వనపుడు పిల్లలుమాత్రం ఎందుకిస్తారు ? జీతం రాగానే తను పట్టుకొనివెళ్ళి ఆమెకు అప్పగించాలి! తనకి డబ్బుతో ఏ అవసరం వున్నా ఆమెను అడిగితీసుకో వలసిందే జీతం పట్టుకొని వెళ్ళినప్పు డల్లా "యింతేనా" అంటుంది. అందే

నువ్వు పైన యింకేమీ సంపాదించలేదా? అని; 'నీ ప్రయోజకత్వం యింతేనా?' అని. అవును. తన పైన ఏమీ సంపాదించలేదు. యన్.ఎం.ఆర్. మజ్దూర్ల కాయకష్టాన్ని దోపిడీచేసే వాళ్ళున్నారు. కంట్రాక్టరులకి లాభం చూపెట్టి, పర్సెంటేజి తీసుకునేవాళ్ళున్నారు. అయితే తనకాపని ఎంతమాత్రం యిష్టంలేదు— చేతకానూకాదు. రెండోపెళ్ళి భార్యలైనా భర్తలను గౌరవంగా చూసేవాళ్ళు, భయభక్తులు ప్రదర్శించేవారు ఎంతో మంది వున్నారు. తన ఖర్మ ఏమిటో యిలాటిది తన పాలబడింది. తాను జీవితంలో చేసిన బుద్ధితక్కువపని ఏదైనావుంటే అది మళ్ళీ పెళ్ళిచేసుకోవడమే. తన ప్రథమభార్య చెల్లెలే గదా, ఆమెలా అణకువగా, ఆప్యాయతగా అనురాగంగా వుంటుందని వూహించాడు కాని యీామె కొరకరాని కొయ్యగా తయారైంది. అనుక్షణమూ తనను రెచ్చగొట్టి, వేధించి ప్రత్యక్ష నరకాన్ని రుచిచూపించడమే ఆమె ధ్యేయమైనట్లు తనకు కనిపిస్తోంది. ఆమె అలా ప్రవర్తిస్తోంది. ఈ బ్రతుకు బ్రతకడంకంటె చావడం మేలేమో— అవును; తను ఎవరికోసం బ్రతకాలి. ఎందుకోసం బ్రతకాలి తను చచ్చిపోతే ఏడ్చేవాళ్ళెవరున్నారు-తన అన్నగారు తప్ప. ఆయనైనా తననీ ప్రత్యక్ష నరకంనుంచి రక్షించి ఒడ్డున పడవెయ్య గలడా? పోనీ, తను ఏ రమణాశ్రమమో అరవిందాశ్రమమో, హృషీకేషమో పోతే. అక్కడ తనచేత ఏదోపని చేయించుకొని యింత తిండిపడేస్తే అక్కడ పడివుండడం మంచిదనుకున్నాడు ...... ఇలా ఆలోచిస్తూనే అనంతరామయ్య రైలు కుదుపుకి నిద్రలోకి జారుకున్నాడు. ఏలూరు స్టేషను వచ్చేసరికి అతనికి మెలకువ వచ్చింది. లేచి, చూసేసరికి పక్కనే పెట్టుకొన్న అతని సంచీలేదు. రైల్వేప్యాసుతోసహా సంచీ ఎవరో ఎత్తుకుపోయారు.

అనంతరామయ్య కట్టుబట్టలతో, జేబులో కొద్దిడబ్బుతో విజయవాడలో దిగి అక్కడి రైల్వేవారితో తన అవస్థ చెప్పుకొని స్టేషను ఆవరణలోంచి బయటపడ్డాడు. పైమీద వస్త్రంకూడా పోయిన నలమహారాజుకంటె తన పరిస్థితి కొంతనయమని సంతృప్తి పడ్డాడు. అసిస్టెంటు యింజనీరుగారు అప్పగించినపని అంత తొందరపని కాదుగనుక, మళ్ళీ ఆ కాగితాలన్నీ ఆఫీసుకివెళ్ళి తయారుచేసి, సంతకాలు చేయించి పంపించవలసినవే గనుక, సూపరింటెండింగు ఇంజనీరు వారి ఆఫీసుకు వెళ్ళి వారి ఆఫీసులో పని చూడకుండానే వరంగల్‌కి వెళ్ళిపోవాలని నిశ్చయించుకొన్నాడు. తాను రమణాశ్రమంగాని, అరవిందాశ్రమంగాని వెళ్ళి వుండిపోవాలని చేసుకున్న

నిర్ణయానికి ప్రారంభసూచనగానే తన సంచీ పోయిందని అనుకున్నాడు.

విజయవాడ వూళ్ళోకి వెళ్ళి చిన్ననాటి స్నేహితుణ్ణి ఒకతనిని కలుసుకొని కొంతడబ్బు అడిగి తీసుకొని ఒక పంచ, తువ్వాలు కొనుక్కొని, స్టేషనుకి వచ్చి వరంగల్ టిక్కట్టు తీసుకొని అనంతరామయ్య ప్రయాణం సాగించాడు.

అన్నగారు, వదినగారు, పిల్లలు చూపిన ఆదరణతో, ఆప్యాయతతో, వాత్సల్యంలో తన యింటి నరకబాధ తాత్కాలికంగా మరచిపోయాడు. రెండు మూడు పర్యాయములు తన మానసిక క్షోభను అన్నగారితో చెబుదామనుకున్నాడుగాని, తన కష్టాలతో, సమస్యలతో ఆ వయస్సులో ఆయనను క్షోభపెట్టి ఆయన మనస్సు వికలంచెయ్యడమెందుకని వూరుకొన్నాడు.

అనంతరామయ్య కాలక్షేపంకోసం రోజూ లైబ్రరీకి వెళ్ళి పేపరు చదివేవాడు; తనకు విసుగుపుట్టేవరకూ వూరంతా తిరిగి వచ్చేవాడు. అనంతరామయ్య వెళ్ళిన నాలుగోరోజున ఒక

ప్రకటన అతని ఫోటోతోసహా పేపర్లో ప్రకటించబడినది, అతనిని ఆకట్టుకుంది. అకస్మాత్తుగా తనఫోటో పేపర్లో చూసే టప్పటికి అతనికి చాలా ఆశ్చర్యం కలిగింది. తనఫోటో క్రింద యీ విధంగా ప్రకటింపబడివుంది. "పూజ్యులు, నా భర్తగారైన అనంతరామయ్యగారు రాజమండ్రి స్టేషనులో ప్రమాదవశాత్తు నాలుగురోజులక్రితం రైలుక్రిందపడి మరణించి పరమపథము చేరుకొన్నారు. కర్మ సామర్లకోటలో రైల్వే క్వార్టర్సులో పదవరోజు బుధవారం జరుగును. వారి ఆత్మకు శాంతి కలుగుగాక యని ప్రార్థించు వారి ధర్మపత్ని రామలక్ష్మి. పుత్రరత్నములు రామశేషు, కృష్ణసాయి పుత్రికారత్నములు మంగ, గంగ "

అనంతరామయ్యకు యీ ప్రకటన చదవగానే గొంతు తడి ఆరిపోయింది. ఆ ఫోటో తనదే, ఆ ప్రకటన వేయించినది తనభార్యే అందులో ఏమీ సందేహం లేదు. కానీ, తను నిక్షేపంగా అన్నగారింటికి వస్తే తాను చనిపోయినట్టు, అందులోనూ రాజమండ్రి స్టేషనులో— ఇది ఎలా సంభవించింది? రాజమండ్రిలో తాను దిగనైనాలేదే. ఒకవేళ తాను యింటికి తిరిగిరానని ఉక్రోషంగా అన్నమాటలకు కక్షతో యీ తప్పుడు ప్రకటన యిచ్చిందా? దానివల్ల ఆమెకు గాని, ఆమె సంతానానికిగాని ఒరిగే లాభమేమిటి? అని పరిపరి విధాల ఆలోచించడం మొదలు పెట్టాడు. అతనికేమీ అంతుచిక్కలేదు. వికలమైన మనసుతో అన్నగారియింటికి వెళ్ళిపోయాడు.

ఇంటికి చేరుకోగానే అన్నగారు "ఒరే అనంతం ఒక తమాషా జరిగిందిరా. నీ పేరుగలవాడెవరో రాజమండ్రి స్టేషను యార్డులో రైలుక్రిందపడి చచ్చిపోయాడు. అతని ముఖమంతా పోల్చ డానికికూడా వీలులేకుండా చితికి పోయిందట. అతని దగ్గరవున్న సంచీలో రైల్వే ప్యాసుమీద పేరు, సామర్లకోట నుంచి బయలుదేరినట్లు వుండే అది నువ్వే అనుకొని రైల్వేవారు ఆ శవాన్ని మీ యింటికి తీసుకొని వెళ్ళి అప్పగించి తాత్కాలికంగా వెయ్యిరూపాయలు ఎక్స్‌గ్రేషియాగా యిచ్చారట. ఆ వార్త మొన్ననే పేపర్లో పడిందని ఎవరో చెబితే తెప్పించి చూశాను. ఈ వేళ పేపర్లో మీ ఆవిడ, పిల్లలు నీఫోటోతో ప్రకటనే యిచ్చారు. నువ్వు వెంటనే క్షేమంగా వున్నట్లు వాళ్ళకి టెలిగ్రాం యిస్తే మంచిదేమో" అన్నారు.

ఆ వార్త నేను చూడలేదుగాని, రామలక్ష్మి వేయించిన ప్రకటన చూశా నన్నయ్యా. నేను రైల్లోంచి ప్రమాదవశాత్తు యార్డులో వున్న పట్టాలమీద పడివుండవచ్చుననీ, మరో రైలింజను మీదనుంచి వెళ్ళడంవల్ల చనిపోయానని ఆ ప్యాసునుబట్టే గుర్తించి వుంటారు. కాని, ఆ సంచీ, ప్యాసు నావే.

అలసిపోయి నేను నిద్రపోతూంటే ఎవడో దొంగ నా సంచీ దొంగిలించాడు. వాడు రాజమండ్రి ప్రాంతంలో దొంగిలించి దిగి పారిపోతూ పట్టాలమీద పడి, ప్రమాదానికి గురై చనిపోయి వుండాలి. ఆ శవానికి పోస్ట్‌మార్టమ్ అయినా నేనే చనిపోయానని రైల్వేవారు నమ్మితే మీ మరదలికి కొంత పెన్షను, యాభై వేల రూపాయలనగదు, ఒక పిల్లవాడికి ఉద్యోగంకూడా ప్రభుత్వం యిస్తారు. నేను బయటపడితే వాళ్ళకు అవేమీ దక్కవు. నేను బ్రతికి వున్నట్లుగా బయటపడి, ఆ డబ్బు, సదుపాయాలూ వాళ్ళకు దక్కకుండా చెయ్యమన్నావా? లేక చచ్చినట్టు పడివుండి ఆ డబ్బు, సదుపాయాలు వాళ్ళకు దక్కేలాగ చెయ్యమంటావా ?

ఇంత జటిలమైన సమస్యను సూటిగా అడిగితే, సూక్ష్మంగా తేల్చివేయడం ఎవరికీ సాధ్యంకాదు. అనంతరామయ్య అన్నగారు ఎటూ తేల్చి చెప్పలేక పోయాడు. బ్రతికి, ఆరోగ్యంగా వున్న తమ్ముణ్ణి, జీవించివుండీ శవంలా శేష జీవితాన్ని గడపమని ఎలా సలహా యివ్వగలడు ? అది కాదని, బ్రతికి వున్నట్లుగా ప్రకటించి అతని జీవితంలో పొదుపుచేసి మిగల్చలేనంత డబ్బు, కుటుంబానికి పెన్షను, నిరుద్యోగిగా కాలం వృధాచేస్తున్న కొడుకుకిఉద్యోగం యిటువంటి సదుపాయాలన్నీ వదులుకో మని ఎలా చెప్పగలడు. ఆయనకు యీ ధర్మసందేహం విడదీయరాని సమస్యగా తోచింది.

అప్పుడు అనంతరామయ్యే తన కుటుంబ పరిస్థితులూ, తనను యింట్లో వాళ్ళు అమర్యాదగా చూసే తీరు, తాను తన భార్య కోరికలూ, తీర్చలేని అసహాయస్థితి, యీ పరిస్థితులలో తాను ఏ ఆలోచనతో వరంగల్లు వచ్చినదీ, ప్రయాణంలో ఏ ఆశ్రమానికైనా వెళ్ళిపోవాలని చేసుకొన్న నిర్ణయం యివన్నీ చెప్పాడు. తన తమ్ముడిలో అగ్ని పర్వతం రగులుతూవుంటే తన ప్రశాంతతకు, స్వస్థతకు భంగం కలిగించడ మెందుకని నాలుగురోజులైనా అనంతరామయ్య నోరు విప్పకుండా, తన కష్టాలు చెప్పుకోకుండా వేదన ననుభవించడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది. సంగతంతా పూర్వాపరాలు విన్నాకకూడా ఆయన యిదమిద్ధంగా తేల్చి ఏమిచెయ్యాలో తమ్ముడికి చెప్పలేకపోయాడు.

చివరికి అనంతరామయ్యే ఓ మార్గం సూచించాడు. అన్ననూ, వదిననూ, పిల్లలనూ, అందరినీ 'తన కర్మకు' సామర్లకోట వెళ్ళి రమ్మన్నాడు. కర్మకాండ ముగిసింతర్వాత తన పిల్లలను వాళ్ళ అమ్మమ్మగారింటిదగ్గర దిగబెట్టి, తన భార్య నొక్కర్తెనూ స్థలం మార్పు కని వరంగల్లు తీసుకొని రమ్మన్నాడు.

ఈలోగా తను గెడ్డం, మీసం పెంచుకొని, యింట్లోనే పడివుంటానన్నాడు. తన భార్య వచ్చిన తర్వాత ఆమెతో ఆలోచించి తను చచ్చినట్లుగా వుండాలో బ్రతికివున్నట్లుగా బయటపడాలో ఆమె ఎలాగ చెబితే అలాగ చెయ్యవచ్చునని చెప్పి, అన్నగారినీ, వదినగారినీ పిల్లలనూ ప్రయాణానికి సిద్ధమవమన్నాడు. తన భార్య వరంగలు వచ్చేదాకా తాను బ్రతికి వున్నట్లుగా తన భార్యకుగాని, మరెవరికిగాని ఎవ్వరూ చెప్పకూడదని కట్టుదిట్టం చేశాడు.

ఈ ఆలోచన అతని అన్నగారికి కొంతలో కొంత నచ్చింది. తమ్ముణ్ణి యింట్లోనే జాగ్రత్తగా వుండమని వారందరూ లేని దుఃఖాన్ని ముఖాలపైకి తెచ్చుకొని సామర్లకోట బయలుదేరి వెళ్ళారు.

ఎనిమిదిరోజులు పోయినతర్వాత అనంతరామయ్య అన్నగారి కుటుంబం అతని భార్య వరంగల్లులో దిగారు. వాళ్ళ యింటికి వెళ్ళేసరికి యిల్లు తాళం వేసివుంది. చుట్టుప్రక్కలవారిని వాకబు చేయగా ఎవరో గెడ్డాలు వున్నాయన మీరు వచ్చి అడిగితే తాళాలు యివ్వమని చెప్పి యిచ్చి వెళ్ళారని తెచ్చియిచ్చారు.

అనంతరామయ్య అన్నగారు తలుపులు తీసుకొని లోపలికి వెళ్ళాక బల్లమీద ఉత్తరం కనపడింది. అందులో యిలా వ్రాసివుంది.

"మీరు యిప్పటివరకూ ఆమెకేమీ చెప్పకపోతే యికమీదట కూడా చెప్పకండి. నేను మరణించినానని అందరితో పాటు ఆమె కూడా అనుకోవడమే మంచిది. నేను చేరదల్చుకున్న చోటికి వెళ్ళిపోతున్నాను. ఎవరికి కావలసినది వారికి దక్కుతున్నప్పుడు విచారమెందుకు? ఎవరికెవరూ లేరు. మానవులు అనాదరణ చేశారని, అవమానిస్తున్నారని బాధపడడంకంటె, శాశ్వత విలువలకోసం తాపత్రయపడడం మంచిదని తోచింది. కర్తవ్యం తోచక ఊగులాడుతున్న సమయంలో భగవంతుడే కర్తవ్య నిర్ణయంచేశాడు. శలవు."